"ఔను. నిజమే." ఒప్పుకుంది గంధపు చెట్టు. ఐతే, 'సువాసనలో నీకన్నా నేను గొప్పదాన్ని సుమా!' అని గొప్పలు చెప్పలేదా గంధపు చెట్టు.

అదే రోజు ఓ శిల్పి వచ్చి అరణ్యంలోని చెట్లన్నిటినీ పరిశీలించి, ఈ రెంటినే ఎన్నుకున్నాడు. తనవెంట వచ్చిన కట్టెలు కొట్టేవాడితో ఆ రెంటినీ నరికించి తన గ్రామానికి తీసుకెళ్ళాడు.

గంధపు కాండంతో వినాయకుడి విగ్రహాన్ని చెక్కాడు. టేకు కాండంతో వినాయకుడుండే ఆలయానికి గడపలని చేసాడు.

భక్తులంతా చందనంతో చేసిన దేవుడికి మొక్కి హారతులిస్తూ, టేకు గడప మీద కొబ్బరి కాయలు కొట్ట సాగారు.

టేకుకి కనువిప్పు కలిగి చందనంతో చెప్పింది.

"మిత్రమా. నీకు క్షమాపణలు చెప్తున్నాను. ఎవరి అర్హతలని బట్టి వారికి ప్రాప్తించాల్సింది ప్రాప్తిస్తుంది. అన్నీ ఆ దేవుడిచ్చినవే కాబట్టి 'నేను గొప్ప, నువ్వు నాకన్నా తక్కువ' అనే అహం కలిగివుండడం మంచిది కాదని ఆలస్యంగా గ్రహించాను."

## 8. అహింసా పుష్పం

ఇద్దరు మిత్రులు తీర్థయాత్రలకి బయలుదేరారు. అనేక క్షేత్రాలకి వెళ్ళి అనేకమంది దేవుళ్ళని దర్శించారు. అయితే మొదటి మిత్రుడు ప్రతీ గుళ్ళోని దేవుడికి పూలదండని, పూజకి పుష్పాలని సమర్పించాడు. రెండో మిత్రుడు ఉట్టి నమస్కారం చేసి ఊరుకున్నాడు.

తిరుగు ప్రయాణంలో మొదటి మిత్రుడు రెండో మిత్రుడితో సగర్వంగా చెప్పాడు.

"నేను భగవంతుడ్ని పూలతో సంతోషపెట్టాను. కాని, నువ్వలా చేయలేదు."

అందుకు రెండో మిత్రుడు నవ్వి చెప్పాడు.

"నేనూ భగవంతుడికి పూలని సమర్పించాను."

"అబద్ధం చెప్పక. నేను చూడలేదా?"

"నేను అర్పించింది అహింసా పుష్పాలు. పూలని చెట్లనించి తెంపటం వల్ల ఆ చెట్లకి బాధ కలుగుతుంది. ఆ హింస చేయకుండా వుండడం ద్వారా నేను దేవుడికి అహింసా పుష్పాలు సమర్పించాను." వివరించాడు రెండో మిత్రుడు.

## 9. దేవుడు ఏం చేస్తాడు?

దేవుణ్ని నమ్మని ఓ నాస్తికుడు ఓ తాత్త్వికుడితో వాదిస్తున్నాడు.

"ఏమిటి దేవుడు? నా చదువు నేను చదివాను. నా ఉద్యోగం నేను సంపాదించుకున్నాను. నా పెళ్ళి నేను చేసుకున్నాను. నా ఇల్లు నేను కట్టుకున్నాను. నా పిల్లలు నా వల్ల పుట్టారు. నా చావు నేను చస్తాను. నాది ప్రతీది నేనే చేసుకున్నాను. ఆయన నాకు చేసింది ఏమిటి? ఇంక దేవుడి మీద నేనెందుకు ఆధారపడాలి?"

"ఒక్కటి తప్పు." నవ్వాడు తాత్త్వికుడు.

"ఏమిటది?"

"నీ దేహం. నీ దేహాన్ని నువ్వు కావాలనుకుని నీ అంతట నువ్వే స్వయంగా తయారుచేసుకున్నావా?"

"...."

"అరవై లక్షల కోట్ల కణాలు గల నీ దేహాన్ని నువ్వు చేసుకోలేదు. దాన్ని చేసిన వాడి పేరే దేవుడు. దాన్లో నిన్ను నింపినవాడి పేరూ దేవుడే. రేపు దాన్లోంచి నిన్ను తీసి పారేసేవాడే దేవుడు. వీటిలో దేనిమీదా నీకు అధికృత లేదు." చెప్పాడు తాత్త్వికుడు.